

జాబ్ కేలండర్ విడుదల ఏదీ?

మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి



ప్రజాశక్తి-పాడేరు టౌన్: అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి సంవత్సరం జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని ముఖ్యమంత్రి జగన్ మాయమాటలు చెప్పి నిరుద్యోగ యువతను మోసం చేశారని మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి విమర్శించారు. ఆదివారం పాడేరు కుమ్మరిపుట్టులోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 2.30 లక్షల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి మాట తప్పారని, గత టిడిపి ప్రభుత్వం ఇచ్చే నిరుద్యోగ భృతిని రద్దు చేశారని ఆరోపించారు. ఉపాధి, ఉద్యోగాలు లేక రాష్ట్రంలో వేలాది మంది యువత ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిపారు. ప్రభుత్వం ఈ నాలుగు సంవత్సరాలలో జాబ్ క్యాలెండర్‌లు విడుదల చేసి ఎన్ని ఉద్యోగాలు కల్పించిందో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం

-సిసి కెమెరాలతో నిఘా - జిల్లాలో 63 కేంద్రాలు - నేటి నుంచి ప్రారంభం - డిఇఒ ఎస్‌కె సలీం బాషా





ప్రజాశక్తి-పాడేరుటౌన్: అల్లూరి జిల్లాలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని డిఇఒ డాక్టర్ ఎస్‌కె సలీం భాషా తెలిపారు. ఏప్రిల్ 3 నుంచి 18 వరకు జరిగే పరీక్షల కోసం విద్యార్థులను అన్ని రకాలుగా సిద్ధం చేసినట్టు వెల్లడించారు. గతేడాది కంటే ఈసారి మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని లక్ష్యంతో ఉన్నామన్నారు. విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించేందుకు తరచూ పరీక్షలు సైతం నిర్వహించామన్నారు. తరగతిలో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధపెట్టినట్టు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. పదో తరగతి పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, వివరాలను ఆయన ప్రజాశక్తికి తెలిపారు. ఆయన మాటల్లోనే..

పరీక్షా కేంద్రాలు, విద్యార్థుల హాజరు

అల్లూరి జిల్లాలోని 63 పరీక్షా కేంద్రాల్లో 11,522 మంది విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. రెగ్యులర్ విద్యార్థులు 10,975 మంది, ప్రైవేట్ విద్యార్థులు 547 మంది ఉన్నారు. వీరిలో బాలురు 5,374 మంది కాగా, బాలికలు 6,148 మంది. పాడేరు డివిజన్ పరిధిలో 39, రంపచోడవరం పరిధిలో 24 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశాం. పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా నిర్వహించేందుకు ఏర్పాటు చేశాం.

ఈసారి పరీక్ష పేపర్లు ఎన్ని

పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన 6 పేపర్ల విధానంలో ఇప్పుడు విద్యార్థులు పరీక్షలు రాయాలి. గతేడాది 7 పేపర్ల విధానంలో పరీక్ష నిర్వహించగా, ప్రస్తుతం తొలిసారి ఆరు పేపర్లతో నిర్వహిస్తున్నారు. బిట్ పేపర్ లేకుండానే ప్రశ్నాపత్రం ఉంటుంది. గతానికి భిన్నంగా ఈసారి ఎన్విజిలేటర్‌లు జంబ్లింగ్ విధానంలో నియమిస్తున్నాం. ప్రతి మూడు రోజులకు ఇన్విజిలేటర్లు మారుతారు.

సామాన్య శాస్త్రం ఒక్క పేపరే..

గతేడాది వరకు భౌతిక, రసాయన శాస్త్రాలకు ఒక పేపర్, జీవశాస్త్రానికి మరో పేపర్ ఉండేది. ప్రస్తుతం సామాన్య శాస్త్రంలో భౌతిక రసాయన జీవశాస్త్రాలకు కలిపి ఒకే ప్రశ్న పత్రం ఉంటుంది. జీవశాస్త్రాన్ని ప్రశ్నాపత్రంలోనే ప్రత్యేక సెక్షన్‌గా విభజిస్తారు.

సిసి కెమెరాల ఏర్పాటు

గతంలో పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతానికి జిల్లాలోని ఆయా పాఠశాలల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. పరీక్షల్లో చూసి రాతలకు, స్లిప్పులు పెట్టి రాసేందుకు అవకాశం లేకుండా చర్యలు తీసుకున్నాం. సిట్టింగ్, ఫ్లైయింగ్ స్క్వాడ్‌లతో పాటు తనిఖీ బృందాలు పర్యవేక్షణ చేస్తాయి. పరీక్ష కేంద్రాల హెచ్‌ఎంలు చీఫ్ సూపరింటెండెంట్‌లుగా వ్యవహరిస్తారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నాం. ఇప్పటికే అన్ని శాఖలు సమన్వయం చేసుకునే విధంగా సమావేశం నిర్వహించి జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒ ఆదేశాలిచ్చారు.

పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాలు

పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాసేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. అన్ని కేంద్రాల్లో బల్లలు ఉండేలా చర్యలు తీసుకున్నాం. పరీక్ష రాసే విద్యార్థులంతా బల్లలపైనే కూర్చుని రాసేలా ఏర్పాటు చేస్తున్నాం. కేంద్రాల్లో తాగునీరు, నిరంతర విద్యుత్ సౌకర్యం ఉండేలా చూస్తున్నాం. ప్రతి కేంద్రం వద్ద ఉచిత వైద్య శిబిరం ఉంటుంది. ఎలాంటి అత్యవసర వైద్య అవసరాలకైనా అక్కడికక్కడే సిబ్బంది ఉంటారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. వీటన్నింటి కోసం ఆయా విభాగాలకు సంబంధించిన అధికారులతో ఇప్పటికే సమన్వయం చేసుకుంటూ ముందుకెళుతున్నాం.

కేంద్రానికి అనుమతి సమయం?

విద్యార్థులు వారికి కేటాయించిన కేంద్రాల వద్దకు ముందుగానే చేరుకోవాలి. పరీక్ష ప్రారంభ సమయం కంటే అరగంట ముందే కేంద్రంలోకి వెళ్లేందుకు అనుమతి ఇస్తాం. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు చరవాణి, ఎలక్ట్రానిక్ పరికరాలను కేంద్రానికి తీసుకు రాకూడదు. పరీక్ష నిర్వహణలో పాల్గొనే సిబ్బందికి కూడా ఇవే నిబంధనలు వర్తిస్తాయి.



రికార్డులు తనిఖీ చేస్తున్న రాష్ట్ర హెల్త్ డైరెక్టర్

రోగులకు మెరుగైన వైద్య సేవలు

స్టేట్ హెల్త్ డైరెక్టర్ రామిరెడ్డి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు జిల్లా ఆసుపత్రిని: రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ వి.రామి రెడ్డి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సికిల్ సెల్ అనీమియా, తలసీమియా నిర్ధారణ పరీక్షలకు సంబంధించి ఆసుపత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన హెచ్ పిఎల్‌సి బయో ర్యాడ్ మెషిన్, ల్యాబ్‌ను పరిశీలించారు. ల్యాబ్‌లో ఇప్పటి వరకు సేకరించిన నమూనాలు, నిర్ధారించిన కేసుల వివరాలను డిసి హెచ్‌ఎస్ శంఖర్ ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. గిరిజన ప్రాంతంలో గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న సికిల్ సెల్ అనీమియా, తలసీమియా అనుమానిత విద్యార్థులకు నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వ్యాధి నిర్ధారణ అనంతరం రోగులకు మెరుగైన వైద్యంతో పాటు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. బ్లడ్ బ్యాంక్ ద్వారా అవసరమైన రోగులకు రక్త యూనిట్లు అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థుల సిక్ వార్డు, ఎన్‌ఆర్‌సి విభాగ వార్డు, అత్యవసర రోగుల వార్డు, టెస్టుల యంత్ర పరికరాలు పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా త్వరితగతిన నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న మందులను, రికార్డులను పరిశీలించారు. ఎపిడమిక్ సీజన్ సమీపిస్తున్నందున జిల్లా ఆసుపత్రి, పిహెచ్‌సిల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జమాల్ భాషా, డిసిహెచ్‌ఎస్ శంఖర్ ప్రసాద్, జిల్లా మలేరియా అధికారి సాంబ మూర్తి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్వాసితులందరికీ న్యాయమైన పరిహారం



గ్రామసభలో మాట్లాడుతున్న ఎస్‌డిసి లక్ష్మీపతి

ప్రజాశక్తి- విఆర్ పురం: నిర్వాసితులందరికీ ఆర్ అండ్ఆర్ చట్టం ప్రకారం న్యాయమైన పరిహారం అందజేస్తామని ఆర్అండ్ ఆర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీపతి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో కెవిఆర్ కాలేజీ ఆవరణలో సర్పంచ్ నరసమ్మ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌డిసి లక్ష్మీపతి మాట్లాడుతూ, ప్రతి నిర్వాసిత కుటుంబంలోని 18ఏళ్లు నిండిన యువతీ యువకులను పరిహారం చెల్లింపునకు పరిగణనలోకి తీసుకుంటామన్నారు.

గ్రామసభలో తహశీల్దార్ శ్రీధర్ మాట్లాడుతూ కాంటూరుతో సంబంధం లేకుండా విలీన మండలాల్లోని ఏడు గ్రామాలను తొలి ప్రాధాన్యత కింద గుర్తించామన్నారు. ఆయా గ్రామాల్లో గతేడాది అక్టోబర్ పదో తేదీని కటాఫ్‌గా తీసుకుని, అప్పటికి 18ఏళ్లు నిండిన వారికి పరిహారం చెల్లిస్తామన్నారు. గిరిజన నిర్వాసిత కుటుంబాలకు ఎటపాక మండలంలోనే ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. గిరిజనేతర కుటుంబాలకు ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలంలోని తాడ్వాయి గ్రామంలో ఇళ్ల స్థలాలను ఇచ్చి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వపరంగా రూ.2.50లక్షల ఆర్థికసాయం అందిస్తామన్నారు. తల్లిదండ్రులు చనిపోయిన అనాథలకు కూడా పరిహారం ఇస్తామన్నారు. నిర్వాసితుల కుటుంబాల జాబితాలో తప్పులుంటే సరిచేసుకోవచ్చని, సంబంధిత సచివాలయం సిబ్బంది, వాలంటీరుకు, గ్రామ కార్యదర్శికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం నిర్వాసితులు మాట్లాడుతూ, ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వమిచ్చే ఆర్థికసాయం రూ.2.50లక్షలు ఎటూ సరిపోదని, సాయాన్ని రూ.ఐదు లక్షలకు పెంచాలని కోరారు. ఇళ్ల నిర్మాణానికి ఇటుకలు, సిమెంట్, ఇసుక ప్రభుత్వమే ఇవ్వాలని కోరారు. గ్రామసభలో జెడ్‌పిటిసి వళ్లరంగారెడ్డి, వైస్ ఎంపిపి దుర్గాభవాని ఏసుబాబు, విఆర్ఒ, గ్రామ కార్యదర్శి స్వరూపారెడ్డి, సచివాలయ సిబ్బంది లావణ్య గ్రామ వాలంటీర్లు నిర్వాసితులు పాల్గొన్నారు.

మన్యంలో ఇటుకల పండగ సందడి



గేటు వేసి డబ్బులు వసూలు చేస్తున్న గిరిజన బాలికలు, చిన్నారులు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం దారకొండ, దుప్పిలివాడ పంచాయతీ గిరిజనులతో పాటు ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు గిరిజనులు ఇటుకలు పండగ ఘనంగా నిర్వహిస్తున్నారు. ఏటా శ్రీరామనవమి మరుసటి రోజు నుంచి గిరిజనులు ఇటుకలు పండగ నిర్వహిస్తూ గ్రామ సమీప రహదారి మార్గాల్లో తాత్కాలికంగా చెక్ గేట్లు ఏర్పాటు చేసి, వచ్చే పోయే వాహనదారులు, ప్రజలను ఆపి, గీతాలు ఆలపిస్తూ పండగ ఆవశ్యకతను తెలుపుతూ డబ్బులు వసూలు చేయడం ఆనవాయితీ. వసూలు చేసిన డబ్బులతో పూజా సామగ్రి కొనుగోలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ పండుగను ఆమ్ పోజార్ అని కూడా గిరిజనులు సంబోధిస్తారు.

పండగ సందర్భంగా బంధుమిత్రులను గిరిజనులు పిలిపించుకొని వారి సాంప్రదాయ వంటకాలను, మాంసాహార భోజనాలు ఏర్పాటు చేసి సహఫంక్తి భోజనాలు చేస్తారు. ఈ నెలాఖరు వరకు గిరిజనులు సాంప్రదాయంగా ఇటుకల పండుగను జరుపుకోవడం విశేషం. . ఇటుకలు పండుగ పురస్కరించుకొని మామిడికాయ పచ్చడి తయారు చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

అడపవలసలో తాగునీటి సమస్యపై

ఖాళీ బిందెలతో గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: మండలంలోని సాగర పంచాయతీ అడపవలస గ్రామంలో తాగునీరు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఆ గ్రామస్తులు గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు టి.సూర్యనారాయణ మాట్లాడుతూ, అడపవలస గ్రామంలో 70 కుటుంబాలు ఉన్నాయన్నారు. గత మూడు వారాల నుంచి గ్రామంలో తాగునీటి సౌకర్యం లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గతంలో మంచినీటి బోరు మరమ్మతులు గురైనప్పుడు ఒక్క కుటుంబం నుంచి వంద చొప్పున వసూలు చేసి మరమ్మత్తు చేసుకోవడం జరిగిందన్నారు. అయినా సరే ఎటువంటి ఉపయోగం లేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సౌకర్యం లేక పోవడంతో తీవ్ర ఇబ్బందలకు గురవుతున్నామని తెలిపారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి అడపవలస గ్రామంలో పర్యటించి తాగునీటి సదుపాయం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సిహెచ్ మంజుల, ఆ గ్రామ మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేపడుతున్న గ్రామస్తులు



పాడేరులో ర్యాలీ చేపడుతున్న క్రైస్తవులు

ఘనంగా 'మట్టల' పండగ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని క్రైస్తవ మందిరాలలో మట్టల ఆదివారం (పామ్ సండే) వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తిశ్రద్ధలతో మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు యెరుషలేములోనికి ప్రవేశించిన రోజున కొందరు మట్టలు పట్టుకుని ఆయనను స్తుతించిన గుర్తు చేసుకుంటూ మట్టల ఆదివారం కార్యక్రమాన్ని క్రైస్తవులు జరుపుకుంటారు. పాడేరు పట్టణంలోని ప్రభువైన యేసుక్రీస్తు ప్రార్థన మందిరం పాస్టర్ జి.తిమోతి ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభువైన ఏసుక్రీస్తు ప్రార్థన మందిరం విశ్వాసులు, తదితరులు పాల్గొన్నారు.

సీలేరు: సీలేరులో మట్టల ఆదివారం వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మట్ల ఆదివారం పండగ సందర్భంగా చిన్నారులు వివిధ వేషధారణలో దర్శనమిచ్చి పలువురు ఆకట్టుకున్నారు. పండుగ ఆవశ్యకతను యుసిఐఎం పాస్టర్ మనసై వివరించారు. వీధుల్లో ప్రదర్శనలను నిర్వహించి, జయహో నినాదాలు చేస్తూ, క్రీస్తు గురించి ప్రార్థనలు చేశారు.



మట్టలను చూపుతున్న చిన్నారులు

వైసిపి ఎమ్మెల్యే బాలరాజు వ్యాఖ్యలపై నిరసన

ఆదివాసీ ద్రోహి అంటూ నినాదాలు .. చింతూరులో దిష్టిబొమ్మ దహనం .. ఎమ్మెల్యే పదవికి రాజీనామాకు డిమాండ్



విఆర్.పురంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ నేతలు



చింతూరులో బాలరాజు దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఆదివాసీ జెఎసి

ప్రజాశక్తి-విఆర్ పురం: బోయ/వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చడం వలన ఆదివాసీలకు నష్టం లేదని వైసిపి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు మాట్లాడటం విడ్డూరంగా ఉందనిగిరిజనసంఘం జిల్లా కార్యదర్శి, విఆర్.పురం జెఎసి నాయకులు పులి.సంతోష్‌కుమార్, జెఎసి నేతలు బురక.కన్నారావు, వేటకాని.మల్లయ్య మండిపడ్డారు. ఐదేళ్ల రాజకీయ ప్రయోజనం కోసం, యావత్ గిరిజనానికి నష్టం చేకూర్చేలా ఇష్టానుసారంగా మాట్లాడటం సరికాదని హెచ్చరించారు. ఎమ్మెల్యే బాలరాజు వ్యాఖ్యలకు నిరసనగా రేఖపల్లి జంక్షన్ వద్ద గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జెఎసి నేతలు మాట్లాడుతూ, ఆదివాసీల ఓట్లతో గెలిచి, అదే ఆదివాసీల గొంతును కోసే మాట్లాడటం మానుకోవాలని ఆదివాసీ ద్రోహిగా తెల్లం బాలరాజు మిగిలి పోవడం ఖాయమన్నారు. ఐదేళ్ల పదవి కోసం తరతరాలుగా కాపాడాల్సిన జాతికి ద్రోహం చేయడం సిగ్గులేదాయని విమర్శించారు. వైసిపి ఎమ్మెల్యే తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకుని, ఇకనైనా స్వార్థపూరిత రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేయడం మానేసి, ఆదివాసుల సమస్యల పరిష్కారానికి పనిచేయాలని హితవు పలికారు. నిరసన కార్యక్రమంలో ఆదివాసీ నేతలు, యువతతోపాటు సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు పాల్గొన్నారు

చింతూరు : బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు మద్దతునివ్వడంతోపాటు దీని వల్ల గిరిజనానికి ఎటువంటి నష్టం జరగదంటూ మీడియా సమావేశం పెట్టి మరీ వెల్లడించిన వైసిపి ఎమ్మెల్యే బాలరాజు తీరుపై ఆదివాసీ జెఎసి చింతూరు కమిటీ ఆధ్వర్యాన చింతూరులో నిరసన చేపట్టారు. చింతూరు సెంటర్‌లో ఎమ్మెల్యే బాలరాజు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జెఎసి నేతలు మాట్లాడుతూ, బోయ,వాల్మీకి, బెంతు ఒరియాలకు ఎస్‌టి రిజర్వేషన్‌పై యావత్ ఆదివాసీ సమాజం ఆందోళన వ్యక్తం చేసి నిరసనలు, ఉద్యమాలు చేపడుతుంటే, ఎస్‌టి రిజర్వేషన్‌తో గిరిజనులు వేసిన ఓట్లతో గెలుపొందిన బాలరాజు ఇలా వ్యతిరేక వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని, తక్షణమే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎజెఎసి నేతలు జల్లి.నరేష్, సీసం సురేష్ , సున్నం వెంకట రమణ, చిన్నారెడ్డి, మడివి రాజు, సాయి, కుంజ సీతారామయ్య పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయండి



రాజవొమ్మంగిలో మాట్లాడుతున్న చేతివృత్తిదారుల సంఘం మండల కన్వీనర్ శ్రీను



అడ్డతీగలలో వాల్‌పోస్టర్ల ఆవిష్కరణలో సిఐటియు మండల నేత సురేష్‌బాబు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ఈనెల 5న చలో ఢిల్లీ ఆందోళన విజయవంతం చేయాలని చేతివృత్తిదారుల సంఘం మండల కన్వీనర్ టి.శ్రీను పిలుపునిచ్చారు. ఆదివారం సిఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికసంఘం భవనంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకం ఈ ఆందోళన జరుగుతోందన్నారు. కార్మిక చట్టాలను సంస్కరించి నాలుగు లేబర్ కోడ్లుగా మార్చడం ద్వారా కార్మికులను యజమానులకు బానిసలను చేసిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను, ప్రజల సంపదను విదేశీ, స్వదేశీ కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తోందని, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెడుతోందన్నారు. మోడీ పాలనలో నిరుద్యోగం, ధరలు ఆకాశాన్నంటాయని, మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా చేపట్టే చలో ఢిల్లీని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు, భవన నిర్మాణ రంగం నాయకులు ఎస్ రామకృష్ణ, ఎస్ అచ్చారావు, వీరబాబు, శివరాజబాబు, ప్రసాద్, రాఘవ పాల్గొన్నారు.

అడ్డతీగల : ఈనెల 5న చలో ఢిల్లీ ఆందోళన విజయవంతం చేయాలని కోరుతూ మండల కేంద్రంలోని వినాయక తాపీ పని వల్ల సంక్షేమ సంఘం భవనం వద్ద సిఐటియు మండల అధ్యక్షుడు జి సురేష్‌బాబు అధ్యక్షతన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. భవన నిర్మాణ, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఫాల్గుణ

8 నుంచి ఆలయ వార్షికోత్సవాలు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని తడిగిరి పంచాయతీ ఉక్కుర్భ గ్రామంలో ఈనెల 8,9,10, తేదీలలో నిర్వహించే భీమలింగేశ్వరస్వామి దేవాలయం వార్షికోత్సవాల సందర్భంగా అరుకు ఎమ్మెల్యే శెట్టి పాల్గుణ చేతులు మీదుగా ఆదివారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు, పెందుర్తి ఏరియా గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు లకే చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి శతక చిట్టయ్య, ఆఫీస్ సెక్రెటరీ శెట్టి జయదాస్, వర్కింగ్ సెక్రెటరీ పొత్తురు మల్లేష్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులతో ఇక్కట్లు



బురదరోడ్డుతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలో 516 జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్న ప్రదేశంలో కనీస జాగ్రత్తలు చేపట్టకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి రహదారిపై వేసిన మట్టి బురద, జారుడుమయంగా మారింది. దూసరపాము, తంటికొండ, సింగంపల్లి, జడ్డంగి తదితర ప్రాంతాల వద్ద జాతీయరహదారిపై రాకపోకలకు బైకిస్టులు, చిన్న వాహనదారులు నానా ఇబ్బందులు పడ్డారు. బైక్‌లు స్కిడ్ అయి పడిపోవడంతో పలువురు గాయాలు పాలుకావడంతోపాటు వేసుకున్న బట్టలనీన బురదమయం కావడంతో ప్రయాణాలు వాయిదా వేసుకోవాల్సి వచ్చిందని వాపోయారు.

అనేక వాహనాలు మట్టిలో ఇరుక్కుపోవడంతో ముందుకు కదలని పరిస్థితి ఉంది. బురదలో చిక్కుకున్న బైక్‌లు, బస్సులు, కార్లు, ఇతర ప్రైవేటు వాహనాలు తోయాల్సిన దుస్థితి ఏర్పడింది. వాహనదారుల ఇబ్బందుల నేపథ్యంలో సంబంధిత సిబ్బంది తక్షణం డైవర్షన్ ఏర్పాటుచేయాలని గిరిజన సంఘం మండల నాయకులు కొండ్ల సూరిబాబు, జె రాజు, పాపారావు సత్యనారాయణ కోరుతున్నారు.

5 నుంచి ఆదివాసీ టి10 క్రికెట్

ప్రజాశక్తి - రంపచోడవరం : ఆదివాసీ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 5నుంచి ఆదివాసీ ప్రీమియర్ లీగ్ (ఎపిఎల్ టి10) మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఆదివాసీ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు తీగల శివాజీ తెలిపారు. రంపచోడవరం మండలం పెద గెద్దాడ క్రికెట్ గ్రౌండ్ వేదికగా నిర్వహించే ఈ టోర్నీలో రంపచోడవరం డివిజన్‌లోని 11మండలాల యువత మాత్రమే పాల్గొనడానికి అర్హులన్నాఉ. మొత్తం 48 జట్లు ఈ టోర్నీలో పాల్గొంటున్నాయని, విజేతలతోపాటు రన్నరప్ తృతీయ, నాలుగోస్థానంలో నిలిచిన జట్లకు కూడా బహుమతులు అందజేస్తామన్నారు. ఈ టోర్నీలో ఆడిన ప్రతి మ్యాచ్‌ను ఆదివాసీ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ యూట్యూబ్ ఛానల్ లో వీక్షించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పెద గెద్దాడ గ్రామ పెద్దలు యూత్ వారి సహకారంతో టోర్నీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న డివైఎఫ్ఐ విశాఖ జిల్లా అధ్యక్షులు యుఎస్ఎన్.రాజు

మెగా డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయాలి

ప్రజాశక్తి -కంచరపాలెం : మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను తక్షణమే విడుదలచేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు యుఎస్ఎన్.రాజు డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యాన మాధవధారలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికారంలోకి వస్తే ఏటా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పిన జగన్మోహన్‌రెడ్డి నాలుగేళ్లుగా నిరుద్యోగులను మోసం చేస్తూనే ఉన్నారని విమర్శించారు. రాష్ట్రంలో డైట్, బిఇడి చేసిన సుమారు 10 లక్షల మంది డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను విస్మరించి, నిరుద్యోగుల ఆత్మహత్యలకు కారణం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దాదాపు 25 వేల పోస్టులకుపైగా ఉపాధ్యాయ ఖాళీలు ఉంటే విద్యాశాఖ మంత్రి మాత్రం నోటికి వచ్చిన లెక్కలు చెబుతున్నారని విమర్శించారు. కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు పరమావధిగా పరిపాలన చేస్తున్నారు తప్ప ఖాళీ పోస్టుల భర్తీపై ధ్యాస లేదన్నారు. ఈ కారణంగానే గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిరుద్యోగులు సరైన తీర్పు ఇచ్చారని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బుద్ధి తెచ్చుకొని పాదయాత్ర సమయంలో యువతకు ఇచ్చిన వాగ్దానాలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రావణ్ కుమార్, విజయ, శరత్, మురళీ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తలారివానిపాలెం రైల్వే అండర్ పాత్‌వేను విస్తరించాలి

ప్రజాశక్తి -గాజువాక : తలారివానిపాలెం రైల్వే అండర్ పాత్‌వేను విస్తరించాలని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబుకు అగనంపూడి అభివృద్ధి కమిటీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ వినతిపత్రం అందించారు. కంచరపాలెం రామ్మూర్తిపేట, పాత గోపాలపట్నం, కొత్తపాలెం రైల్వే బ్రిడ్జిలను విస్తరించిన మాదిరిగా తలారివానిపాలెంలో చేపట్టాలని కోరారు. తలారివానిపాలెం వాసులు ఉన్నత పాఠశాలకు, పోస్టాఫీసుకు, విద్యుత్ బిల్లులు కట్టుకునేందుకు అగనంపూడి వచ్చేందుకు దువ్వాడ రైల్వే బ్రిడ్జి దాటుకొని ఎనిమిది కిలోమీటర్లు ప్రయాణించి రావాల్సి వస్తోందని వివరించారు తలారివానిపాలెం రైల్వే అండర్ పాత్‌వేను విస్తరిస్తే కేవలం రెండు కిలోమీటర్లు దూరంలోనే అగనంపూడి చేరుకుంటారని తెలిపారు. కార్లు, వ్యాన్లు, ఆటోల రాకపోకలకు తగ్గట్లు అండర్‌పాత్‌వేను విస్తరించాలని కోరారు.

4న జాబ్ మేళా

ప్రజాశక్తి -కంచరపాలెం : ఇండస్ట్రియల్ కస్టమైజ్డ్ స్కిల్ ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ ప్రోగ్రామ్‌లో యలమంచిలి సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పోర్ట్స్ కంపెనీ పలు ఉద్యోగాలకు ఈ నెల 4వ తేదీన ద్వారకానగర్ 4వ లైన్‌లో ఉన్న కంపెనీ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయి చైతన్య తెలిపారు. బిఎస్‌సి కంప్యూటర్స్, డిప్లమో ఇన్ కంప్యూటర్స్, బిటెక్ కంప్యూటర్స్, ఎంసిఎ 2021-22 సంవత్సరంలో ఉత్తీర్ణులైన యువతీయువకులు హాజరుకావాలని కోరారు. ఎంపికైన వారికి రూ.10 వేలు నుంచి రూ.12 వేలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు మరిన్ని వివరాలకు జిల్లా నైపుణ్యాభివృద్ధి కార్యనిర్వాహకుడు రమేష్ 9292553352ను సంప్రదించాలని సూచించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-సీతమ్మధార : నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లకు సిఐ శ్రీనివాసరావు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. వివాదాల్లో తలదూర్చకుండా ఉండాలని సూచించారు. సమాజంలో సత్ప్రవర్తన, క్రమశిక్షణతో ఉండాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



అరుకులోయలో పరీక్షా కేంద్రం పాఠశాల

ప్రజాశక్తి-అరకులోయరూరల్: ఈనెల 3 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు చేసినట్లు ప్రధాన ఉపాధ్యాయుడు ఎల్బీ దయానిధి తెలిపారు. ఈనెల 15వ తేదీ వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. మండలంలోని 4 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీటిలో 9 ప్రభుత్వ పాఠశాలలు, 2 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయన్నారు. కొత్తబల్లుగుడ బాలికల పాఠశాలలో 237, సిహెచ్ స్కూల్లో 190, ఏపీఆర్ గురుకులం బాలుర పాఠశాలలో 180, గవర్నమెంట్ హైస్కూల్ లో 174 కలిపి నాలుగు పరీక్షా కేంద్రాలో 781 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. విద్యార్థులను అరగంట ముందు నుంచే పరీక్షా కేంద్రంలోనికి హాజరు కావాలని సూచించారు.

సీలేరు: సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు.. ఈ పరీక్షల్లో సీలేరు ఎపి గురుకుల పాఠశాల నుంచి 63 మంది జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల 33మంది , డిఎవి పాఠశాల విద్యార్థులు 19 మంది పబ్లిక్ పరీక్షలు రాయనున్నారు. చీఫ్ సూపరింటెండెంట్ కె. సింహాచలం, డిపార్ట్‌మెంట్ అధికారిగా దేవీశ్వరరావు వ్యవహరించనున్నారు.

రాజవొమ్మంగి : 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు స్థానిక ఎంఇఒ కె తాతబ్బాయిదొర తెలిపారు. మండలంలోని రాజవొమ్మంగి, సింగంపల్లి, జడ్డంగి ప్రాథమిక ఉన్నత పాఠశాలల్లో నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలోని రాజవొమ్మంగి, జడ్డంగి, లాగరాయి జిల్లాపరిషత్ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో బాటూ, బోర్నగూడెం, సింగంపల్లి, అమీనాబాద్, జడ్డంగి, రాజవొమ్మంగి ఆశ్రమ పాఠశాలలు, రాజవొమ్మంగి గురుకుల పాఠశాలలకు చెందిన 478మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలు వద్ద అన్ని వసతులుతోబాటు, సిబ్బందిని ఇప్పటికే ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు ఉదయం 8,45 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించబోరన్నారు.

హుకుంపేట:పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామని పాడేరు డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు తెలిపారు. ఆదివారం ఆయన హుకుంపేట, బాకూరు పదవ తరగతి పరీక్ష జరగనున్న కేంద్రాలను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మండలంలో 708 మంది. పరీక్షలకు హాజరు. కానున్నారని అయన తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్, బెంచిలు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు.

విద్యార్థులకు పిఒ శుభాకాంక్షలు

పాడేరుటౌన్:పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలక్రిష్ణ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. గిరిజన విద్యార్థుల ఉన్నత చదువులకు, పోటీ పరీక్షలకు ఐటిడిఎ అండగా ఉంటుందని చెప్పారు.

సర్పంచుల నిధుల కోసం న్యాయ పోరాటం

ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్

ప్రజాశక్తి -పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిన గ్రామ పంచాయతీల, సర్పంచుల నిధులను రాబట్టేందుకు న్యాయ పోరాటం సాగిస్తామని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు వైవిబి రాజేంద్రప్రసాద్ వెల్లడించారు. పాడేరు, అరకు ప్రాంతాల్లో ఆదివారం పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ప్రతినిధి బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొర్రా నాగరాజు అధ్యక్షతన పాడేరులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెండు తెలుగు రాష్ట్రాలలో సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా మిగిల్చి పంచాయతీ నిధులను వాడుకున్నారని విమర్శించారు. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు వచ్చిన 8 వేల660 కోట్లు నిధులు దారి మళ్లించి రాష్ట్ర ప్రభుత్వం సొంత పథకాలకు సొంత అవసరాలకు వినియోగించిందని చెప్పారు. పంచాయతీ నిధులను తమ ఖాతాలో వేయాలని కోర్టును ఆశ్రయించామని చెప్పారు. గ్రామ పంచాయతీల నిధులు దారిని మళ్లించడంపై త్వరలోనే అన్ని రాజకీయ పార్టీలతో కలిసి చలో ఢిల్లీ కార్యక్రమం చేపడతామని చెప్పారు రాష్ట్రంలో గ్రామపంచాయతీల నిధులు దారి మళ్లింపుపై పంచాయతీరాజ్ రాష్ట్ర కమిషనర్‌తో పాటు కార్యదర్శిలే బాధ్యులని కోర్టులో వారే సమాధానం చెబుతారన్నారు. రాష్ట్రంలో వైసిపి మద్దతు సర్పంచులు 90 శాతం మంది రాష్ట్ర ప్రభుత్వం తీరుపై అసంతృప్తి, అసహనంతో ఉన్నారని ఆయన వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బొర్రా నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు నరేంద్ర, ఏపీ సర్పంచుల ఫోరం అధ్యక్షులు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాపరెడ్డి, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షులు రామకృష్ణ నాయుడు, ముల్లంగి రామకృష్ణారెడ్డి, కొత్తపు మునిరెడ్డి, చింతకాయల సుజాత ముత్యాలు, అనకాపల్లి జిల్లా సర్పంచుల సంఘం ప్రతినిధులు సోము నాయుడు, చుక్క ధనుంజయ యాదవ్, చిత్తూరు జిల్లా పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షులు కోకా ప్రకాష్ నాయుడు, సర్పంచుల సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కార్యదర్శి కుప్పాల మురళి, విశాఖ జిల్లా పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షుడు ఎరుకు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్


సింహాద్రి అప్పన్న కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

వైభవంగా సింహాద్రి అప్పన్న కల్యాణం

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్న వార్షిక కల్యాణ మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. కల్యాణోత్సవంలో భాగంగా స్వామివారిని ఆదివారం వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపారు. ఆరాధన సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం కోలాటోత్సవం, ఎదురు సన్నాయోత్సవం అనంతరం రథోత్సవాన్ని నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో దేవస్థానం ఈవో వి.త్రినాథరావు దంపతులతోపాటు దేవస్థానం వివిధ విభాగాల అధికారులు, భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రథోత్సవం అనంతరం స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణమండపం వద్దకు చేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాత్రి పదిన్నర గంటలకు స్వామివారి కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవం సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, భోజన వసతిని కల్పించారు. కల్యాణోత్సవాన్ని భక్తులు వీక్షించేందుకు వీలుగా భారీ స్క్రీన్‌లను ఏర్పాటుచేశారు. గట్టి పోలీస్ బందోబస్తు, వైద్య శిబిరాలను కూడా ఏర్పాటుచేశారు. అంబులెన్సులను, అగ్నిమాపక యంత్రాలను అందుబాటులో ఉంచారు. భక్తులు కొండ దిగువనుంచి పైకి వెళ్లేందుకు దేవస్థానం అధికారులు బస్సు సౌకర్యాన్ని ఏర్పాటుచేశారు. కల్యాణం అనంతరం భక్తులకు స్వామివారి ప్రసాదాన్ని, అక్షింతలను ప్రత్యేక కౌంటర్లలో అందుబాటులో ఉంచారు.

కెజిబివి విద్యార్థులకు కంప్యూటర్ కోర్స్ సర్టిఫికెట్లు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం కస్తూరిబా గాంధీ బాలికల ఇంటర్మీడియట్ విద్యార్థులకు కంప్యూటర్ కోర్స్ (ఎంఎస్ ఆఫీస్) సర్టిఫికెట్లను జన శిక్షణ సంస్థ డైరెక్టర్ రామరాజు అందజేశారు. జన శిక్షణ సంస్థ ఆధ్వర్యాన ఇంటర్మీడియట్ చదువుతున్న 40 మంది విద్యార్థులకు మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చారు. ఒక్కొక్క విద్యార్థికి శిక్షణకు అవసరమైన రూ.300 ఫీజును జన కులం ఫౌండేషన్ అందించినట్లు రామరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెజిబివి ప్రత్యేకాధికారి చంద్రకళ, జన శిక్షణ సంస్థ డైరెక్టర్ నాయుడు, జన కులం ఫౌండర్ సత్యదేవ్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను ఆదివారం హైకోర్టు జడ్జి జ్యోతిర్మయి దంపతులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణం చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. అధికారులు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందించారు.

పసిపాప మృతి

ప్రజాశక్తి-జి.మాడుగుల:మండలంలోని గెమ్మెలి పంచాయతీ లవ్వాపల్లిలో 12 నెలల పసిపాప మృత్యువాత పడింది. అధికారులు, వైద్య సిబ్బంది నిర్లక్ష్యం నిర్లక్ష్యంతో పసిపాప మృత్యువాత చెందిందని తల్లిదండ్రులు సెగ్గె చిన్నారావు, పార్వతమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని పసిపాప ఆదివారం అస్వస్థతకు గురైంది. స్థానికంగా ఉన్న వైద్య సిబ్బంది సకాలంలో స్పందించక పోవడంతో శ్వాస అందక మృతి చెందిందని తల్లిదండ్రులు తెలిపారు. ఇదిలా ఉండగా సమీప గ్రామం బలమానుసంకలో నెల రోజుల కిందట బాలింత కొండపల్లి కొండమ్మ రక్తహీనతతో మృతి చెందిన ఘటన మరువక ముందే చిన్నారి మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. బాలింత కొండపల్లి కొండమ్మ మృతిని వైద్య సిబ్బంది బయటకు తెలియకుండా దాచిపెట్టినట్లు తెలిసింది.


గిరిజన యువతతో మాట్లాడుతున్న ఎఎస్‌పి ప్రతాప్ కిషోర్

యువత సన్మార్గంలో పయనించాలి

ప్రజాశక్తి -సీలేరు: ప్రభుత్వం ఇచ్చిన పథకాలను సద్వినియోగం చేసుకుని గిరిజన యువత మంచి మార్గంలో నడవాలని చింతపల్లి అడిషనల్ ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ సూచించారు. ఆదివారం ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో విస్తృతంగా పర్యటించారు. మారుమూల గ్రామాల గిరిజన యువతతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి మాట్లాడుతూ యువత చెడుమార్గాలను విడనాడి మంచి మార్గాల్లో నడవాలని సూచించారు. ముఖ్యంగా గంజాయి సాగు, అక్రమ రవాణా చట్టరీత్యా నేరమని ఇటువంటి కార్యకలాపాలకు ఎవరూ పాల్పడవద్దని హితవు పలికారు ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగ ఉపాధి అవకాశాలను యువత అందిపుచ్చుకుని, ఉన్నత శిఖరాలకు అవరోధించాలని ఆకాంక్షించారు. యువత క్రీడలపై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పర్యటనలో జికె.వీధి సిఐ అశోక్‌కుమార్, సిఆర్‌పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సురేష్, ఎస్ఐలు రామకృష్ణ,అప్పలసూరి పాల్గొన్నారు.

రాష్ట్రంలో కానరాని అభివృద్ధి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వచ్చాక ఎటువంటి పెట్టుబడులూ రాలేదని, అభివృద్ధి ఎక్కడా జరగలేదని, జాబ్ క్యాలెండర్ ఊసేలేదని టిడిపి దక్షిణ నియోజకవర్గం ఇన్‌ఛార్జి గండి బాబ్జీ విమర్శించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో అనాడు జగన్మోహన్ రెడ్డి చాలా హామీలు ఇచ్చారని, వాటిలో ఏ ఒక్కటీ అమలు కాలేదని అన్నారు. పరిశ్రమల శాఖ మంత్రిగా గుడివాడ అమర్‌నాథ్ ఒక్క పరిశ్రమనూ తీసుకురాలేదన్నారు. సమావేశంలో టిడిపి నియోజకవర్గ నాయకులు విల్లూరి చక్రవర్తి, వలిశెట్టి తాతాజీ, మైలపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఆప్ కార్యకర్తలు

ఆప్ ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రధాని మోడీ విద్యార్హతలు ఏమిటో ప్రజలందరికీ తెలియాల్సి ఉందని ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర మహిళా కన్వీనర్ డాక్టర్ శీతల్ అన్నారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆదివారం మోడీ హఠావో, దేశ్ బచావో పేరిట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోడీ విద్యార్హత సర్టిఫికెట్లను వెల్లడి చేయడంలో ఉండే ఇబ్బంది ఏమిటన్నారు. ఇదే అంశంపై తమ నేత కేజ్రీవాల్ పిటిషన్ వేస్తే తిరిగి ఆయనకే జరిమానా విధించడం దారుణమన్నారు. మోడీ నిరంకుశపాలన పట్ల ప్రజలు స్పందించాలని, దేశాన్ని కాపాడాలని అన్నారు.


సిపిఎం నేత సుబ్బారావుకు అశ్రు నివాళి

- అంతిమయాత్రలో పాల్గొన్న వందలాది మంది

ప్రజాశక్తి - గాజువాక : సిపిఎం సీనియర్ నాయకులు జి.సుబ్బారావుకు విశాఖ కార్మిక, శ్రామిక జనావళి అశ్రు నివాళి అర్పించింది. శనివారం రాత్రి ఓ ఆసుపత్రిలో సుబ్బారావు చనిపోయారన్న వార్త తెలిసి ఆదివారం ఉదయానికే ఆయన స్వగృహానికి పెద్ద సంఖ్యలో సిపిఎం, ఇతర వామపక్ష పార్టీల కార్యకర్తలు, కార్మికులు, పట్టణ ప్రముఖులు తరలివచ్చారు. అంతిమయాత్ర అశేష జనవాహిని నడుమ ఆదివారం గాజువాక ప్రాంతంలో సాగింది. వందలాది మంది తరలివచ్చి అశ్రు నివాళి అర్పించారు. సుబ్బారావు అంతిమయాత్ర శీలానగర్‌లోని ఆయన స్వగృహం నుంచి చిన్న గంట్యాడ శ్మశాన వాటిక వరకూ జరగ్గా ఎక్కడ చూసినా జనమే కనిపించారు.

తొలుత శీలానగర్‌లో సంతాప సభ నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ జిల్లాలోని వేలాది మంది కష్టజీవులకు ఆప్తమిత్రుడు సుబ్బారావు అని కొనియాడారు. నిత్య శ్రమజీవిని కోల్పోయామని అన్నారు. కాలనీ ప్రజల సమస్యలపై సుబ్బారావు నిరంతరం స్పందించారన్నారు. సమాజంలో నిస్వార్థంగా పనిచేసినప్పుడే ఆ వ్యక్తికి మంచి పేరు ప్రఖ్యాతలు వస్తాయని, అలా పని చేసిన వ్యక్తే సుబ్బారావు అని కొనియాడారు. నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకూ పని చేశారన్నారు. మాజీ ఎసిపి ఎకె.ఖాన్ మాట్లాడుతూ సుబ్బారావు ఎంత మంచివారో గుర్తు చేశారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ నిజాయితీగల వ్యక్తి సుబ్బారావు అని అన్నారు. ఆయన అంటే ఎప్పటికీ తనలాంటి వారికి భయమేనన్నారు. స్టీల్‌ప్లాంట్ గుర్తింపు సంఘం నాయకులు డి.ఆదినారాయణ, స్టీల్ సిఐటియు గౌరవ అధ్యక్షులు జె.అయోధ్యరాం మాట్లాడుతూ కార్మికుల పక్షాన పోరాడిన వ్యక్తి సుబ్బారావు అని కొనియాడారు. ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి అధ్యతన జరిగిన ఈ సంతాప సభలో సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, నాయకులు ఎం.రాంబాబు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎన్.రాజేంద్రప్రసాద్, డాక్టర్ ఎం.రమేష్ కుమార్, లోకేష్, పద్మనాభరాజు, ఎస్.సుధాకర్, పి.వెంకటరెడ్డి, అక్కిరెడ్డిపాలెం, దశమకొండ, అప్పన్నకాలనీ, మింది, గాజువాక, ఆటోనగర్ ప్రాంతాలకు చెందిన వందలాది మంది ప్రజలు పాల్గొన్నారు. నివాళ్లర్పించిన వారిలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర నాయకులు ఆర్‌వి.నరసింహారావు, మాజీ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, చింతపూడి వెంకటరామయ్య, జివిఎంసి గాజువాక జోనల్ కమిషనర్ సింహాచలం, ఎడిసి సన్యాసిరావు, గాజువాక ప్రాంతంలోని కార్పొరేటర్లు, అన్ని పార్టీల నాయకులు, ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు టి.శ్రీరామ్మూర్తి, ప్రజాశక్తి విశాఖ బ్రాంచి మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, వైఎస్ఆర్‌టియుసి ప్రధాన కార్యదర్శి మస్తానప్ప, టిఎన్‌టియుసి నాయకులు విల్లా రామ్మోహన్ కుమార్, సిపిఐ నాయకులు సత్యనారాయణ తదితరులు ఉన్నారు. సుబ్బారావు మృతికి బిహెచ్‌ఇఎల్ నాయకులు జిటిపి ప్రకాష్, ఎస్.జగన్నాథరావు, కె.నారపరెడ్డి, జి.అచ్చం నాయుడు, కె.విజయకుమార్, పి.కనకారావు ప్రగాఢ సంతాపం తెలిపారు. సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి ఓ ప్రకటనలో సంతాపం ప్రకటించారు.


వందలాది మందితో సాగుతున్న సుబ్బారావు అంతిమయాత్ర


సుబ్బారావు పార్థివదేహం వద్ద నివాళ్లర్పిస్తున్న సిఐటియు రాష్ట్ర నాయకులు

శాంతిని కాంక్షిస్తూ పరుగు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఆర్కే బీచ్‌లోని విశ్వ ప్రియా ఫంక్షన్ హాల్ నుంచి తెన్నేటి పార్క్ వరకూ 3, 5, 10 కిలోమీటర్ల విభాగాల్లో అహింసా రన్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా భారత నావికాదళ వైస్ అడ్మిరల్ కుమార్ నాయక్ హాజరై ఈ రన్‌ను ప్రారంభించారు. రన్‌లో 3 కిలోమీటర్ల విభాగంలో 500 మంది, 5 కిలోమీటర్ల విభాగంలో 400 మంది, 10 కిలోమీటర్ల విభాగంలో 320 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుమార్ నాయక్ మాట్లాడుతూ ప్రజల్లో మానసికోల్లాసానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ చైర్‌పర్సన్ ఆశిష్ దారివాల్, చీఫ్ సెక్రటరీ మహేంద్ర పాల్గొన్నారు. విజేతలకు రూ.లక్షా 75 వేలు విలువైన బహుమతులను నిర్వాహకులు అందజేశారు.


ఆందోళన చేపట్టిన సిపిఎం నాయకులు, గ్రామస్తులు

విద్యుత్ పునరుద్ధరణలో నిర్లక్ష్యంపై ధర్నా

ప్రజాశక్తి -ఎటపాక : ఈదురుగాలుల దెబ్బకు మూడు రోజులుగా విద్యుత్ లేకున్నా, పునరుద్ధరించడంలో సంబంధిత శాఖాధికారుల నిర్లక్ష్యంపై ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో తుమ్మలనగర్ వాసులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఐ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, శుక్రవారం సాయంత్రం వచ్చిన ఈదురుగాలులతో మండలంలో పలుచోట్ల చెట్లు కూలి విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. మూడురోజులుగా తుమ్మల నగర్‌లో విద్యుత్ లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నా సంబంధిత విద్యుత్ అధికారులు, సిబ్బంది పట్టించుకోలేదని వాపోయారు. విద్యుత్ సమస్యను తక్షణం పరిష్కరించకుంటే ప్రజాగ్రహం చవిచూడక తప్పదని హెచ్చరించారు. విలీన మండలాల్లోని అన్ని గ్రామాలకు విద్యుత్ సిబ్బందిని నియమించాలని, విద్యుత్ పోయిన వెంటనే పునరుద్ధరించే చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజల ఆందోళన చేపట్టిన తర్వాత స్పందించిన విద్యుత్‌సిబ్బంది హుటాహుటిన తుమ్మలనగర్‌లో విద్యుత్ పునరుద్ధరించడం విశేషం.

జి 20 పేరుతో ప్రజాధనం దుర్వినియోగం

- పట్టణ మౌలిక సదుపాయాల ప్రైవేటీకరణకు తెరలేపిన సమ్మిట్
- సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో నాలుగు రోజులపాటు ఆర్భాటంగా జరిగిన జి 20 దేశాల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూప్ సమ్మిట్‌లో పట్టణ మౌలిక సదుపాయాలను పూర్తిగా ప్రైవేటుపరం చేయాలని నిర్ణయాలు తీసుకోవడం ఆందోళన కలిగించే అంశమని సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణ సదుపాయాల ప్రైవేటీకరణను తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ఇప్పటికే మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉందని, ఉన్న సదుపాయాలు కూడా అత్యంత నాసిరకంగా ఉన్నాయని చెబుతూనే దీనికి పరిష్కారంగా ప్రైవేటు పెట్టుబడులను పట్టణ మౌలిక సదుపాయాల రంగంలోకి ఆహ్వానించాలని పేర్కొనడం దారుణమన్నారు. భవిష్యత్తులో మంచినీరు, పారిశుధ్యం, పార్కులు, ఖాళీ స్థలాలు, ఫంక్షన్ హాళ్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు తదితరాలన్నీ ప్రైవేటుపరం కానున్నాయన్నారు. ఆ నిర్ణయాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదించడం చాలా ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. ఇప్పటికే ముడసర్లోవ పార్క్‌ను ప్రైవేట్‌పరం చేయడానికి సిద్ధం చేశారని, త్వరలోనే శివాజీ పార్క్, బిఆర్‌టిఎస్ రోడ్డులను ప్రైవేటుపరం చేయనున్నారని అన్నారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులను ప్రభుత్వ - ప్రైవేటు భాగస్వామ్యంతో పదేళ్లకు ప్రైవేటు సంస్థలకు ఇచ్చారన్నారు. పన్నులన్నీ విపరీతంగా పెరుగుతున్నాయని తెలిపారు. జి 20 సదస్సుకు జివిఎంసి ఏకంగా రూ.157 కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఇలా ప్రజాధనాన్ని దుర్వినియోగ పరచడం తగదన్నారు. ఖర్చు చేసిన దానిలో మితిమీరిన అవినీతి చోటుచేసుకుందని పేర్కొన్నారు. ఈ ఖర్చు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయాల్సి ఉన్నా ఆ పని జరగలేదన్నారు. ప్రజల పన్నుల ద్వారా చెల్లించిన సొమ్మును జివిఎంసి ఈ విధంగా దుర్వినియోగం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ ఖర్చుపై అన్ని రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లు లేదా స్వతంత్ర సంస్థలచే దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు.

ఆశా జాస్తికి నారీ పురస్కారం

ప్రజాశక్తి - విశాఖపట్నం : విశాఖ నగరానికి చెందిన సన్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశా జాస్తికి నారీ పురస్కార్ - 2023 లభించింది. ఇటీవల హైదరాబాద్‌లోని జెఆర్‌సి కన్వెన్షన్ హాల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో తెలంగాణ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, తెలంగాణ విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎపి పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కె.రోజా చేతులమీదుగా ఆమె ఈ పురస్కారాన్ని అందుకున్నారు.